ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G), రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.

Registered No : APTEL/25/A1201

# గాయత్రి వార్తలు

జాతీయ తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను
గాయత్రి వార్తలు జాతీయ తెలుగు దినపత్రికలో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో పనిచేయుటకు ఆసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
యం. నాగేశ్వర రావు
ఎడిటర్ గాయత్రి వార్తలు
సెల్: 73860 45673

PUBLISHED FROM : DELHI - MAHARASHTRA - ANDHRA PRADESH - TELANGANA - KARNATAKA - TAMILANADU - GOA - LOCKNOW - EDITOR : M. NAGESWARARAO

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ సోమవారం 01-9-2025 సంపుటి : 1 సంచిక :80 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 8 వెల రు : 2/-

# యూపీఎస్సీ అభ్యర్థుల కోసం 'ప్రతిభా సేతు'..




- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యూపీఎస్సీ పరీక్షల్లో విజయం సాధించలేకపోయిన అభ్యర్థుల కోసం 'ప్రతిభా సేతు' అనే ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించారు.
- ఈ పోర్టల్ ద్వారా ప్రైవేట్ కంపెనీలు తమకు అనువైన అభ్యర్థులను గుర్తించి వారికి ఉద్యోగాలు ఇవ్వవచ్చని తెలిపారు.
- దేశంలో భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడటంపై ప్రధానమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.
- ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.
- జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం , ఇతర భద్రతా దళాల సేవలను ప్రశంసించారు.

యూపీఎస్సీ అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా 'ప్రతిభా సేతు' పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. దీని ద్వారా యూపీఎస్సీ అభ్యర్థులకు అనేక ప్రయోజనాలు ఉన్నట్లు మన్‌కీ బాత్125వ కార్యక్రమంలో మోదీ తెలిపారు. దేశంలోని కఠినమైన పరీక్షల్లో సివిల్ సర్వీసెస్ ఒకటని.. ప్రతి ఏడాది ఎంతో మంది అభ్యర్థులు రాస్తుంటారన్నారు. ఎంతో సమయం, డబ్బును ఖర్చు చేసి నిజాయతీగా కష్టపడుతున్న అభ్యర్థులు ఒక్కోసారి స్వల్ప తేడాతో సివిల్స్ తుది జాబితాలో చోటు దక్కించుకోలేకపోతున్నారని.. ఇలాంటి వారి కోసం 'ప్రతిభా సేతు' పోర్టల్‌ను ప్రవేశపెట్టినట్లు చెప్పారు.

**జెట్ ఇంజిన్లను తయారుచేస్తాం**

సివిల్స్ పరీక్షల అన్ని దశలలో ఉత్తీర్ణత సాధించి.. మెరిట్ లిస్టులో పేరు లేని అభ్యర్థుల వివరాలను ఇకపై ఈ పోర్టల్‌లో ఉంచనున్నట్లు ప్రధాని వెల్లడించారు. ఈ వివరాలను ప్రైవేట్ కంపెనీలు తీసుకొని.. తమ సంస్థలలో వారికి ఉపాధి కల్పించవచ్చని పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**ప్రకృతి వైపరీత్యాలు దేశాన్ని పరీక్షిస్తున్నాయి..**

దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటం, వరదలపై మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలు దేశాన్ని పరీక్షిస్తున్నాయన్నారు. అనేక రాష్ట్రాల్లో భారీ వరదల కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయారని.. వేల సంఖ్యలో నిరాశ్రయులయ్యారన్నారు. తీవ్రంగా శ్రమిస్తున్న జాతీయ విపత్తు ప్రతిస్పందన దళాలు , భద్రతా దళాలు, సామాజిక కార్యకర్తలు, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

**జమ్మూకశ్మీర్ మరింత ముందుకు వెళ్తోంది..**

వినాశకరమైన ప్రకృతి వైపరీత్యాలు జమ్మూకశ్మీర్‌ను అతలాకుతలం చేస్తున్నప్పటికీ.. అనేక విషయాల్లో ముందుకు వెళ్తుందన్నారు. ఇటీవల శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో నిర్వహించిన ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్ గురించి మోదీ ప్రస్తావించారు. దేశ్యాప్తంగా 800 మందికి పైగా అథ్లెట్లు ఇందులో పాల్గొన్నారన్నారు. పురుషులతో సమానంగా మహిళా అథ్లెట్లు కూడా ఇందులో ప్రతిభ చూపారన్నారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా కశ్మీర్‌లోని పుల్వామాలో తొలి సారిగా డే-నైట్ క్రికెట్ మ్యాచ్ జరిగిందని పేర్కొన్నారు. దేశం మార్పువైపు పయనిస్తోందనడానికి ఇవి ఉదాహరణగా నిలిచాయన్నారు.

## వర్క్ ఫ్రమ్ హోం ద్వారా గ్రామస్థాయిలోనూ ఉపాధి అవకాశాలు: కేంద్రమంత్రి పెమ్మసాని



తెనాలి: ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేస్తున్న కృషి వల్ల రాష్ట్రంలో భారీగా ఉద్యోగాలు రాబోతున్నాయని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం నందివెలుగులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. వర్క్ ఫ్రమ్ హోం ద్వారా గ్రామస్థాయిలోనూ ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వైకాపా పాలనలో గుంతల రోడ్లపై ప్రయాణం చేయలేక ప్రజలు ఇబ్బందులు పడేవారని, కూటమి ప్రభుత్వంలో కొత్తరోడ్లు వేశామని తెలిపారు.

## 'ఓటర్ అధికార్ యాత్ర'..

### బిహార్‌లో కాంగ్రెస్‌కు బూస్ట్ ఇచ్చేనా?



మిగతాది 2లో

## మంత్రి నారా లోకేశ్‌కు అరుదైన గౌరవం



అమరావతి: ఏపీ మంత్రి నారా లోకేశ్‌కు అరుదైన గౌరవం దక్కింది. స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్(ఎస్‌వీపీ)లో భాగస్వామ్యం కావాలని కోరుతూ ఆస్ట్రేలియన్ హైకమిషన్ ఆయనకు ఆహ్వాన లేఖ పంపింది. ఏపీలో మానవ వనరులు, సాంకేతిక, ఆర్థికాభివృద్ధిని ప్రశంసించింది. ప్రస్తుత ప్రధాని మోదీ కూడా 2001లో ఎస్‌వీపీలో భాగస్వామ్యం అయ్యారని వెల్లడించింది.

## అనకాపల్లిలో నూకాలమ్మ మొక్కు తీర్చుకున్న హోంమంత్రి అనిత



అనకాపల్లి పట్టణం: ఏపీ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అనకాపల్లిలో నూకాలమ్మ అమ్మవారి మొక్కు తీర్చుకున్నారు. మొక్కులో భాగంగా ఆదివారం ఆలయంలో పండగ నిర్వహించారు. అమ్మవారికి ఘటాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు మంత్రికి దేవాదాయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ పీలా నాగశ్రీను, జిల్లా దేవాదాయ శాఖ అధికారి సుధారాణి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రౌండ్ బుకింగ్ ఉండే బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం



అమరావతి: స్త్రీ శక్తి పథకం అమలు చేస్తున్న 5 రకాల బస్సుల్లో.. గ్రౌండ్ బుకింగ్ ఉన్నవాటికి కూడా మహిళల ఉచిత ప్రయాణాన్ని అనుమతించేలా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని బస్సులను కండక్టర్లు లేకుండా రెండు, మూడు బస్టాండ్లలో మాత్రమే ఆగేలా నడుపుతున్నారు. అటువంటి బస్సులకు ఆయా బస్టాండ్లలో మాత్రమే టికెట్లు జారీ (గ్రౌండ్ బుకింగ్) చేస్తారు.

పేజి 2లో ▶

## తెదేపాలో ఉన్నందుకు గర్విస్తున్నా: మంత్రి అనిత



అనకాపల్లి పట్టణం: తెలుగుదేశం పార్టీలో ఉన్నందుకు తాను గర్వపడుతున్నానని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అనకాపల్లిలో మృతి చెందిన ఇద్దరు పార్టీ కార్యకర్తల కుటుంబ సభ్యులకు రూ.5 లక్షలు చొప్పున ఇన్సూరెన్స్ నగదు చెక్కును ఆమె అందజేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి కోటి సభ్యత్వాలు ఉన్నాయని తెలిపారు. దేశంలోని ఏ ప్రాంతీయ పార్టీకి ఇంత అధిక సంఖ్యలో సభ్యత్వాలు లేవన్నారు. పార్టీలో కార్యకర్తల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు దక్కుతుందని పేర్కొన్నారు. క్రమశిక్షణ గల తెలుగుదేశం పార్టీలో ఉండటం తనకు ఎంతో గర్వకారణంగా ఉందని వివరించారు. అనంతరం 21 మందికి రూ.45 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆమె అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అత్యధిక సంక్షేమ పథకాలు అందిస్తున్న రాష్ట్రం ఏపీనే: కేంద్ర మంత్రి పెమ్మసాని



తెనాలి: అత్యధిక సంక్షేమ పథకాలు అందిస్తున్న రాష్ట్రం ఏపీనే అని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం నందివెలుగులో స్మార్ట్ రేషన్ కార్డులను రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి పంపిణీ చేశారు.

పేజి 2లో ▶

## తితిదే బర్డ్ ట్రస్ట్‌కు భారీ విరాళం



తిరుమల: తితిదేకు ఆదివారం భారీ విరాళం అందింది. తితిదే బర్డ్ ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన ఆర్.ఎస్.బి.రిటైల్ ఇండియా లిమిటెడ్ సంస్థ రూ.2.93 కోట్లు, ఆర్.ఎస్.బ్రదర్స్ జ్యువెలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.1.10 కోట్లు విరాళంగా అందించాయి. ఈ మేరకు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్యచౌదరిలకు ఆయా సంస్థల ఎండీలు పొట్టి వెంకటేశ్వర్లు, సీర్న రాజమౌళి, టి.ప్రసాదరావు, పొట్టి మాలతి లక్ష్మీకుమారి సంబంధిత డీడీలను అందజేశారు. మరోవైపు నరసరావుపేటకు చెందిన జె.రామాంజనేయులు శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10లక్షల విరాళం అందించారు.


## గణేశ్ శోభాయాత్ర..

### తాడిపత్రిలో జేసీ, కాకర్ల వర్గాల మధ్య రాళ్లదాడి



మిగతాది 2లో

## గణేశ్ ఉత్సవాల్లో ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ



మిగతాది 2లో

# సంపాదకీయం

## ఎమ్మెల్యేలు వసూల్ రాజాలు

తెలుగునాట.. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పలువురు శాసనసభ్యులు వారి ముఖ్యమంత్రులకు కంట్లో నలుసుల్లా తయారవుతున్నారా? ఎం.ఎల్.ఎ. అంటే మెంబర్ ఆఫ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ.. అంటే చట్టసభ సభ్యులు. చట్టసభల్లో చట్టాలు చేస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేయాల్సిన శాసనసభ్యులే ఇప్పుడు ప్రజలపాలిట సమస్యగా మారుతున్నారు. ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లో కొంత మంది శాసనసభ్యులు లేని అధికారాలను సంక్రమింప జేసుకొని ఆయా నియోజకవర్గాలలో ప్రజలు గాలి పీల్చుకోవాలన్నా తమ అనుమతి తప్పనిసరి అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. 2004 నుంచి ప్రారంభమైన ఈ ధోరణి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో వెర్రితలలు వేస్తోంది. జగన్మోహన్ రెడ్డి హయాంలో శాసనసభ్యులకు అపరిమిత స్వేచ్ఛను ఇవ్వడంతో వారు ప్రభుత్వ కార్యాలయాలను తమ అజమాయిషీలోకి తెచ్చుకున్నారు. ఇప్పుడు కూటమి ఎమ్మెల్యేలకూ అదే ఆదర్శమైంది. గతానికి భిన్నంగా ఈ జాడ్యం ఇప్పుడు తెలంగాణకు కూడా విస్తరించింది. 2009లో ఎమ్మెల్యేగా ఎన్నికైన లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ మంచినీటి సరఫరా, డ్రైనేజీ వంటి స్థానిక సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చిన వారిని ఉద్దేశించి, వాటి గురించి స్థానిక ప్రజాప్రతినిధులైన కార్పొరేటర్లకు చెప్పాలని సూచించేవారు. ఇది ప్రజలకు రుచించలేదు. అది వేరే విషయం! 1983కు ముందు గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఉనికి ఉండేది కాదు. అక్కడి ప్రజా సమస్యలను స్థానిక సంస్థలే పరిష్కరించేవి. అప్పట్లో ఎమ్మెల్యేలు ప్రజలకు పెద్దగా అందుబాటులో ఉండేవారు కారు. ఎమ్మెల్యేలను కలుసుకోగలిగే పరిస్థితి జిల్లా స్థాయిలో కొద్దిమందికే ఉండేది. ఇక మంత్రులు, జిల్లా కలెక్టర్లను కలుసుకోవడం అరుదైన అవకాశంగా ఉండేది. అలా కలుసుకోగలిగిన వారికి పలుకుబడి ఉన్నట్టు పరిగణించేవారు. ఆ తర్వాత ఎన్టీఆర్ హయాంలో ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువ చేశారు. దీంతో ఎమ్మెల్యేలు ప్రజల్లో తిరగక తప్పలేదు. ఫలితంగా ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలను, కుటుంబ పంచాయితీలను పరిష్కరించవలసిందిగా కూడా ఎమ్మెల్యేలను కోరేవారు. మొగుడూ పెళ్లాల పంచాయితీలు తామెందుకు పరిష్కరించాలని ఆ రోజుల్లో ఎమ్మెల్యేలు విసుక్కొనేవారు. హైదరాబాద్‌లో ఉండే తమ ఎమ్మెల్యేలను తెలంగాణ జిల్లాలకు చెందిన ప్రజలు వచ్చి కలుసుకొని బాధలు చెప్పుకొనేవారు. కొంతమందైతే తిరుగు ప్రయాణాలకు చార్జీలు ఇవ్వవలసిందిగా ఎమ్మెల్యేలను కోరేవారు. తమను కలవడానికి వచ్చిన వారికి కాఫీ, టీలు తాగించడంతో పాటు భోజనం, వసతి కూడా ఏర్పాటు చేయవలసి రావడంతో శాసనసభ్యులు ఆర్థికంగా నలిగిపోయేవారు. పెళ్లిళ్లు, చావులకు వెళ్లడం విధిగా మారింది. అదే సమయంలో ఖర్చుల కోసం డబ్బు కూడా డిమాండ్ చేసేవారు. తెలంగాణలో ఇప్పటికీ ఈ పరిస్థితి ఉంది. కొంత కాలం క్రితం ఒక లారీ డ్రైవర్ తమ నియోజకవర్గ ఎమ్మెల్యేకు ఫోన్ చేసి తాను డ్యూటీ మీద దూరంగా ఉన్నాననీ, పురిటి నొప్పులతో బాధపడుతున్న తన భార్యను ఆస్పత్రిలో చేర్పించి ప్రసవం చేయించవలసిందిగా కోరారు. ఇలాంటి విచిత్రమైన అనుభవాలను శాసనసభ్యులు గతంలో పంచుకొనేవారు. ఇదంతా గతం. ఇప్పుడు ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాలకు సామంత రాజులుగా, దండ నాయకులుగా తయారయ్యారు. తెలంగాణలో కూడా ఈ పోకడలు మొదలయ్యాయి. తెలంగాణలో యూరియా కొరత ఇప్పుడు ప్రధాన సమస్యగా ఉంది.

రైతులు ప్రభుత్వాన్ని నిందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన రామగుండం ఎరువుల కంపెనీ తెలంగాణలో ఉన్నప్పటికీ సాంకేతిక సమస్యలు తలెత్తి ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో యూరియా కొరత మరింత తీవ్రమైంది. ఈ పరిస్థితుల్లో ఎవరైనా ఏమి చేస్తారు? ఎరువుల ఫాక్టరీలో మరమ్మతులను వేగంగా పూర్తిచేయించి ఉత్పత్తి తిరిగి ప్రారంభమయ్యేలా చేస్తారు. కానీ అధికార పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. మరమ్మతుల కాంట్రాక్టు పొందిన సంస్థ ప్రతినిధులు తనను కలసి తన సంగతి ఏమిటో తేల్చకపోతే ఎలా అని భీష్మించుకొని కూర్చున్నారు. ఈ వ్యవహారం మంత్రి, ముఖ్యమంత్రి వరకూ వెళ్లింది. దీంతో సంబంధిత శాఖ మంత్రి కల్పించుకొని సదరు ఎమ్మెల్యేను పిలిపించుకొని సర్దిచెప్పారు. ఈ ధోరణిని ఏమనాలి? ఇల్లు తగలబడుతుంటే బొగ్గులు ఏరుకోవడానికి ప్రయత్నించినట్టుగా లేదా? కేసీఆర్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన కూడా తమ పార్టీ ఎమ్మెల్యేలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. ఈ విషయంలో ఒకరికొకరు ఆదర్శం అయ్యారు. ఫలితంగా తెలంగాణలో గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గాలలో ఎమ్మెల్యేల ఆధిపత్యం పెరిగిపోయింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారం చేయాలన్నా ఎమ్మెల్యేల అనుమతి తప్పనిసరి చేశారు. పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ కట్టాలన్నా శాసనసభ్యుడి అనుమతి ఉండాలని నిర్దేశించారు. దీంతో యావత్ అధికార యంత్రాంగం రాజకీయ నాయకుల గుప్పిట్లోకి వెళ్లిపోయింది. ఒకవైపు లేని అధికారాలను అనుభవిస్తూ, మరోవైపు భూ కబ్జాలు, దందాలలో ఎమ్మెల్యేలు మునిగితేలారు. ఫలితంగా 2023 ఎన్నికలకు ముందు భారత రాష్ట్ర సమితికి చెందిన శాసనసభ్యులపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. అయినప్పటికీ ఆ ఎన్నికల్లో కేసీఆర్ అభ్యర్థులను మార్చకుండా పాతవాళ్లు అందరికీ టికెట్లు ఇచ్చారు. అప్రతిష్ఠపాలైన శాసనసభ్యులను మార్చి ఉంటే కేసీఆర్ అధికారం కోల్పోయి ఉండేవారు కాదన్న అభిప్రాయం భారత రాష్ట్ర సమితి ముఖ్యులలో ఇప్పటికీ ఉంది.

### నాడు 10 వేలు.. నేడు 30 కోట్లు!

ప్రభుత్వ వ్యవహారాలలో శాసనసభ్యులు జోక్యం చేసుకొనే విధానం 2004 నుంచే మొదలైంది. దీంతో శాసనసభ్యులు అక్రమ సంపాదనకు అలవాటుపడ్డారు. ఇప్పుడు అదొక హక్కుగా మారింది. ముఖ్యమంత్రులు సైతం ఎమ్మెల్యేలను అదుపు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి రాష్ట్రంలో 2004 తర్వాత పైస్థాయిలో అవినీతి వ్యవస్థీకృతం అయింది. అదే సమయంలో మీరు కూడా సంపాదించుకోండి అన్నట్టుగా ఎమ్మెల్యేలకు స్వేచ్ఛ ఇచ్చారు. దీంతో చట్టసభల సభ్యులు జనం మీద పడ్డారు. ఐదేళ్లపాటు సంపాదించిన డబ్బుతో ఎన్నికల్లో మళ్లీ గెలవడానికి విచ్చలవిడిగా ఖర్చు చేయడం మొదలుపెట్టారు. దీంతో తెలుగునాట ఇప్పుడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒక నియోజకవర్గంలో సగటున 30 కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. వచ్చే ఎన్నికల నాటికి ఈ మొత్తం ఇంకా పెరుగుతుంది. తెలుగు రాష్ట్రాలలో ఎన్నికలు ఖరీదైన వ్యవహారంగా మారాయి. 1985 ఎన్నికల్లో వెనుకబడిన శ్రీకాకుళంలోని ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి తెలుగుదేశం తరఫున పోటీ చేసిన ప్రతిభా భారతికి అయిన ఎన్నికల వ్యయం ఎంతో తెలుసా? కేవలం పది వేల రూపాయలు! అదే ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల నుంచి తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసిన జీవన్ రెడ్డికి అయిన వ్యయం 15 వేల రూపాయలు మాత్రమే. తన వద్ద ఉన్న పది వేలు సరిపోవని, మరో ఐదు వేలు పార్టీ తరఫున ఇప్పిస్తే గెలిచి వస్తానని ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎన్టీఆర్‌ను జీవన్ రెడ్డి కోరగా, మరుసటి రోజు ఎన్టీఆర్ ఆ ఐదు వేలూ సర్దుబాటు చేయించారు. అప్పట్లో పదివేలు మాత్రమే ఖర్చు చేసిన నియోజకవర్గాలలో ఇప్పుడు పది కోట్లు కూడా సరిపోవడం లేదు. కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో ఖర్చు వంద కోట్లు దాటుతోంది.

## ‘ఓటర్ అధికార్ యాత్ర’.. బిహార్‌లో కాంగ్రెస్‌కు బూస్ట్ ఇచ్చేనా?

మొదటిపేజీ తరువాయి

బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ను ఎన్నికల సంఘం చేపట్టడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇందులో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన ‘ఓటర్ అధికార్ యాత్ర’ ద్వారా మహిళా, రైతు సమస్యలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, పారిశ్రామికాభివృద్ధి వంటి అంశాలను లేవనెత్తుతూ స్థానికులకు చేరువయ్యే ప్రయత్నం చేశారు. మొత్తంగా 16 రోజులపాటు 25 జిల్లాల్లో 1300కి.మీటర్లకు పైగా సాగిన ఈ యాత్రతో కాంగ్రెస్ ఏమేరకు సఫలమైందనే విషయాన్ని పరిశీలిస్తే..

**ఎస్ఐఆర్‌పై మొదలుపెట్టి..**

ఓటరు జాబితా సమగ్ర సవరణను ఈసీ చేపట్టిన సమయంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్.. లక్షలాది ఓట్ల తొలగింపు, డోర్-టు-డోర్ వెరిఫికేషన్‌లో లోపాలు, ఒకే ఇంటి నంబరుతో వందలాది మంది ఓటర్లు ఉన్న విషయాలను ప్రస్తావిస్తోంది. వీటిపై రాష్ట్రంలో పోరాటం చేస్తున్న వారిందర్నీ రాహుల్ యాత్ర ఏకం చేయడంతోపాటు ప్రజల్లో ఓటుపై అవగాహన పెరగడానికి తాజా యాత్రం దోహదపడినట్లు పార్టీ భావిస్తోంది.

**ఘనచరిత్ర ఉన్నా..**

రాష్ట్రాన్ని సుదీర్ఘకాలం పాటు (1990 వరకు) పాలించిన కాంగ్రెస్ అనంతరం మండల్ రాజకీయాల ప్రభావంతో తన ప్రాభవాన్ని కోల్పోయింది. లాలు ప్రసాద్ ఆ తరువాత నీతీశ్ పగ్గాలు చేపట్టిన తర్వాత దిగజారింది. 2005లో తొమ్మిది సీట్లకే (6.09శాతం ఓట్లు) పరిమితం కాగా.. 2010లో నాలుగు, 2015లో 27, 2020లో 19 సీట్లతో సరిపెట్టుకుంది. లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి. ప్రస్తుతం 9.48శాతం ఓటర్ల మద్దతే ఉంది. సీట్ల సంఖ్య తగ్గడంతోపాటు క్యాడర్‌నూ క్రమంగా కోల్పోతున్నట్లు గ్రహించిన అధిష్ఠానం.. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించి అందుకు వ్యూహాలు రచిస్తోంది.

**కూటమి ఐక్యత..**

రాష్ట్రంలో ఎన్డీయే అనుసరిస్తున్న అభివృద్ధి నమూనాపై విమర్శలు గుప్పిస్తోన్న రాహుల్.. మహిళా సమస్యలతోపాటు రైతులు, పేదరికం, నిరుద్యోగం, పారిశ్రామికాభివృద్ధిలో వెనుకంజ వంటి అంశాలను లేవనెత్తే ప్రయత్నం చేశారు. దీంతోపాటు ఇండియా కూటమి ఐకమత్యంగా ఉందనే విషయాన్ని చాటిచెప్పే ప్రయత్నం చేశారు. తమిళనాడు సీఎం స్టాలిన్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, వామపక్ష నేతలతోపాటు కాంగ్రెస్ సీఎంలు రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య ఈ యాత్రలో పాల్గొన్నారు. ఝార?ండ్ సీఎం హేమంత్ సోరెన్ సహా ఇతర పార్టీల ప్రతినిధులు చివరిరోజు (సెప్టెంబర్ 1) యాత్రలో పాల్గొననుండగా.. మమతా బెనర్జీ తరఫున ప్రతినిధులను పంపించే అవకాశం ఉందని సమాచారం.

**అన్నివర్గాల పార్టీగా..**

రాష్ట్రంలో యాదవ్, ముస్లింల మద్దతున్న పార్టీగా ఆర్జేడీ.. పేద, అణగారిన వర్గాల పార్టీలుగా వామపక్షాలకు పేరు ఉంది. సీపీఐ(ఎంఎల్) గత ఎన్నికల్లో 12 సీట్లను గెలుచుకుంది. ఆ పార్టీ కూడా ఇండియా కూటమిలో ఉంది. అయితే కాంగ్రెస్ పార్టీనే అన్ని వర్గాల పార్టీగా ప్రకటించుకుంటోంది. ఈ క్రమంలో ఓటు చోరీ పేరుతో అధికార ఎన్డీయేపై ఒత్తిడి తెచ్చే వ్యూహాలను అమలు చేస్తున్న రాహుల్.. బిహారీ స్టైల్‌లో టవల్‌ను మెడపై వేసుకోవడం, బైక్‌ను స్వయంగా నడుపుతూ, హైవే వెంట దాబాలను సందర్శిస్తూ స్థానికులతో మమేకమయ్యే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో మహిళలు, దళితులు, ముస్లింలు, యాదవ్‌లు, గిరిజన, ఓబీసీ, ఈబీసీ వర్గాల వారి సమస్యలను ప్రస్తావిస్తూ వారికి దగ్గరయ్యే ప్రయత్నాలు చేశారు.

భారత్ జోడో యాత్రతో సానుకూల ఫలితాలు వచ్చినట్లు భావిస్తున్న కాంగ్రెస్.. ఈ యాత్ర కూడా మరింత బూస్ట్ ఇస్తుందనే ఆశతో ముందస్తు ప్రచారానికి ఉపక్రమించింది. తాజాగా ఇది విజయవంతమైందని భావిస్తోంది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ఎలాంటి వ్యూహాలు రచిస్తుందనే దానిపై ఆసక్తి నెలకొంది.

## పూరీ క్షేత్రం పేరిట నకిలీ వెబ్‌సైట్ దోపిడీ!



పూరీ: ఒడిశాలోని ప్రముఖ పూరీ జగన్నాథ ఆలయంలో ఆన్‌లైన్ పూజల పేరిట భక్తులను మోసం చేస్తున్న ఓ నకిలీ వెబ్‌సైట్‌ను పోలీసులు గుర్తించారు. శ్రీక్షేత్రంలో ప్రత్యేక పూజలు, దర్శనం, నైవేద్య సమర్పణ తదితర సేవలు అందిస్తామంటూ తప్పుడు ప్రకటనలతో ఆ వెబ్‌సైట్ రూ.వేలల్లో దోపిడికి పాల్పడుతోందని పూరీ ఎస్పీ ప్రతీక్ సింగ్ తెలిపారు. ఈ వ్యవహారం గుట్టు రట్టు కావడంతో.. సైబర్ బృందాన్ని అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. ఆ వెబ్‌సైట్‌ను బ్లాక్ చేసి, కేసు దర్యాప్తునకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

“జగన్నాథుని దర్శనం, ప్రత్యేక పూజలు తదితర సేవలు అందిస్తామంటూ తప్పుడు ప్రకటనలు ఇచ్చే నకిలీ వెబ్‌సైట్‌లకు భక్తులు దూరంగా ఉండాలి. మోసపూరిత ప్రకటనలకు ఆకర్షితులు కావొద్దు. ఆలయ యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించే ఛానెళ్ల ద్వారా సేవలను ధ్రువీకరించుకోవాలి. అధికారిక వెబ్‌సైట్‌లను మాత్రమే ఉపయోగించాలి. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో హోటళ్లను బుక్ చేసుకునే సమయంలో మరిన్ని జాగ్రత్తలు అవసరం. డబ్బుల కోసం భక్తుల మనోభావాలతో ఆడుకునేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం” అని ఎస్పీ హెచ్చరించారు. - ఈటీవీ భారత్

## ‘ఎయిరిండియా’ విషాదం.. విఘ్నరాజాయ వందనం




దేశవ్యాప్తంగా కొనసాగుతున్న వినాయక ఉత్సవాల్లో విభిన్న ఆకృతుల గణేశుడి విగ్రహాలు, ఆకట్టుకునే రూపకాలతో మండపాలు కొలువుదీరాయి. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గత జూన్ నెలలో జరిగిన ఎయిరిండియా విమాన ఘోర ప్రమాదం 260 ప్రాణాలను బలిగొనగా.. 60 మందికి పైగా క్షతగాత్రులుగా మారిన విషయం తెలిసిందే. ఈ ప్రమాద బాధితులకు నివాళిగా.. నాటి ఘటనాస్థలిని ప్రతిబింబిస్తూ అహ్మదాబాద్ నగరవాసులు ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేశారు. ప్రమాద తీవ్రతను చాటడంతోపాటు సిబ్బంది చేపట్టిన సహాయక చర్యలకు కృతజ్ఞతగా దీన్ని రూపొందించారు. మండపాన్ని సందర్శిస్తున్న భక్తులు ఆ మహా విషాదం పునరావృతం కారాదని గణపతిని మొక్కుతున్నారు.

## గణేశ్ శోభాయాత్ర.. తాడిపత్రిలో జేసీ, కాకర్ల వర్గాల మధ్య రాళ్లదాడి

మొదటిపేజీ తరువాయి

తాడిపత్రి: అనంతపురం జిల్లా తాడిపత్రిలో గణేశ్ శోభాయాత్ర సందర్భంగా జేసీ ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల రంగనాథ్ అనుచరుల మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాలు పరస్పరం రాళ్లదాడి చేసుకున్నాయి. రంగంలోకి దిగిన పోలీసులు వారిని చెదరగొట్టారు. శోభాయాత్ర సందర్భంగా ఆసుపత్రిపాలెం వద్ద కాకర్ల రంగనాథ్ వర్గీయులకు చెందిన విగ్రహం నిదానంగా వెళుతుండటంతో.. కాస్త వేగంగా వెళ్లాలని జేసీ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. దీంతో ఆగ్రహించిన రంగనాథ్.. ప్రభాకర్‌రెడ్డిని దూషించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఘర్షణ చోటు చేసుకున్నట్టు సమాచారం. రాళ్ల దాడిలో రంగనాథ్‌కు చెందిన ఐషర్ వాహనం, లారీ అద్దాలు ధ్వంసమయ్యాయి. పరిస్థితి అదుపులోకి వచ్చిన తర్వాత పోలీసులు తిరిగి శోభాయాత్ర కొనసాగించారు. ఎన్నికల ముందుకు కాకర్ల రంగనాథ్ వైకాపా నుంచి తెదేపాలో చేరారు. ఎన్నికల అనంతరం ప్రభాకర్‌రెడ్డి, రంగనాథ్ వర్గాల మధ్య వివాదం తలెత్తింది.

## గణేశ్ ఉత్సవాల్లో ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ

మొదటిపేజీ తరువాయి

విద్యానగర్: గుంటూరు జిల్లా విద్యానగర్‌లో ఎంఎన్‌కే యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేశ్ ఉత్సవాల్లో రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ, హీరో నారా రోహిత్ పాల్గొన్నారు. వారితోపాటు హీరోయిన్ వృతి వాఘాని, దర్శకుడు వెంకటేశ్ నిమ్మలపూడికి ఉత్సవ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చిత్రబృందం గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించింది. మొదటి నుంచి విభిన్న చిత్రాలతో మెప్పిస్తున్న నారా రోహిత్.. సకుటుంబ సపరివార సమేతంగా అందరూ చూడదగ్గ చక్కటి హాస్య ప్రేమకథా చిత్రంతో మన ముందుకు వచ్చారని మన్నవ మోహన కృష్ణ అన్నారు. వినాయకచవితి రోజున విడుదలైన ఈ చిత్రం విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో దిగ్విజయంగా ప్రదర్శితమవుతోందని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయవంతమైన చిత్రాలు నారా రోహిత్ తీయాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. వైకాపా హయాంలో ఒక్క కంపెనీ కూడా రాష్ట్రానికి రాలేదన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చొరవతో త్వరలో భారీగా ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు.

## అత్యధిక సంక్షేమ పథకాలు అందిస్తున్న రాష్ట్రం ఏపీనే:

మొదటిపేజీ తరువాయి

రేషన్ దుకాణాల్లో రాగులు, నూనె, కందిపప్పు అందిస్తాం: నాదెండ్ల

రేషన్ దుకాణాల్లో రాగులు, నూనె, గోధుమ పిండి, కందిపప్పు అందిస్తామని నాదెండ్ల మనోహర్ అన్నారు. నెలంతా రేషన్ అందుబాటులో ఉండేలా చేస్తామన్నారు. గత ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ప్రభుత్వం చేపట్టే విప్లవాత్మక నిర్ణయాలు పేదల సంక్షేమం కోసమే అని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా సూపర్ సిక్స్ అమలు చేస్తున్నట్లు వివరించారు.

## గ్రౌండ్ బుకింగ్ ఉండే బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

మొదటిపేజీ తరువాయి

ఇటువంటి పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌ల్లో మహిళలు ఇక ఉచితంగా ప్రయాణించవచ్చు.

సింహాచలం కొండపైకి నడిచే సిటీ బస్సుల్లోనూ స్త్రీశక్తి పథకం అమలు చేస్తున్నారు. ఈ బస్సులకు ఘాట్ టోల్ ఫీజు వసూలు చేయకుండా మినహాయించాలని దేవస్థానం ఈవోకి ఆర్టీసీ అధికారులు లేఖ రాశారు.

తిరుమల ఘాట్ కాకుండా రాష్ట్రమంతటా 39 ఘాట్ రోడ్లపై బస్సులు తిరుగుతున్నాయి. వీటన్నింటిలో మహిళలు ఉచితంగా ప్రయాణించేలా ఆదేశాలిచ్చారు.

బూతులు తిట్టుకున్న ప్రయాణికులపై కేసు!

బొబ్బిలి నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సులో సీటు విషయంలో ఓ వ్యక్తి, మహిళ బూతులు తిట్టుకుంటూ ఘర్షణపడ్డారు. శుక్రవారం ఈ ఘటన జరగ్గా, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఈ ఘటన ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో తోటి ప్రయాణికులకు అసౌకర్యం కలిగించిన ఆ ఇద్దరిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పార్వతీపురం డిపో అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించారు.

## అమిత్ షాపై తీవ్ర వ్యాఖ్యలు.. ఎంపీ మహువా మొయిత్రాపై కేసు

బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లను నిరోధించడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను ఉద్దేశిస్తూ టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇవి కాస్త రాజకీయ దుమారం రేపాయి. తాజాగా ఈ వ్యవహారంలో మహువాపై కేసు నమోదైంది. ఓ స్థానిక వ్యక్తి ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్ పోలీసులు తెలిపారు.



ఎంపీ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని, రాజ్యాంగ విరుద్ధమని ఫిర్యాదుదారు ఆరోపించినట్లు పోలీసులు వెల్లడించారు. అదేవిధంగా 1971 సమయంలో రాయ్‌పుర్‌లోని మానా క్యాంప్ ప్రాంతంలో అనేకమంది బంగ్లాదేశీ శరణార్థులు స్థిరపడ్డారని, మహువా వ్యాఖ్యలు వారిలో భయాందోళనలు రేకెత్తించాయని కూడా ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. అంతకుముందు పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణానగర్ కోత్వాలీ పోలీసు స్టేషన్‌లోనూ ఆమెపై ఫిర్యాదు దాఖలైంది.

బంగ్లాదేశ్ నుంచి చొరబాట్ల విషయంలో మహువా మొయిత్రా ఇటీవల కేంద్రంపై విరుచుకుపడ్డారు. “సరిహద్దు భద్రత విషయంలో కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పుకొంటోంది. భాజపా నేతలు పదే పదే చొరబాటుదార్ల గురించి మాట్లాడుతున్నారు. అయితే.. దేశ సరిహద్దుల్ని పరిరక్షించే బాధ్యతను ఐదు భద్రతాదళాలు నిర్వర్తిస్తున్నాయి. అవన్నీ కేంద్ర హోంశాఖ పరిధిలోనే పనిచేస్తున్నాయి. కేంద్ర హోం శాఖ, హోం మంత్రి సరిహద్దుల్ని రక్షించలేకపోయినప్పుడు.. చొరబాటుదార్లు దేశ ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రధాని స్వయంగా చెప్పినప్పుడు.. ఆ తప్పు ఎవరిది?” అని ఆమె ప్రశ్నించారు. ఈ క్రమంలోనే అమిత్ షా (%బూఎ్ఱ రాష్ట్రుప్ర%)ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిని భాజపా ఖండించింది.

# ప్రస్తుత పెన్షన్లు పెంచాలి కొత్త పెన్షన్లు ఇవ్వాలి

- హైదరాబాదులో సెప్టెంబర్ 9న మహా గర్జన విజయవంతం చేయాలి
- కాంగ్రెస్ మోసం, ప్రతిపక్షం వైఫల్యం మంద కృష్ణ మాదిగ



**గాయత్రి వార్తలు:** వికలాంగులు,వితంతువులు, వృద్ధుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారిని మోసం చేస్తోందని,ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ మాత్రం అడ్రస్ లేకుండా పోయాడని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ మండిపడ్డారు.శనివారం సత్తుపల్లి నియోజకవర్గ స్థాయిలో కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో కృష్ణా మాంగో మార్కెట్ యాడ్ లో జరిగిన వికలాంగులు,వితంతువులు, వృద్ధాప్య పెన్షన్ దారుల మహా గర్జన సన్నాహక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సమావేశానికి వికలాంగుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సురేష్ అధ్యక్షత వహించారు.

## కాంగ్రెస్ హామీలపై నిలదీయాలి

మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ,ఎన్నికల సమయంలో పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ మాట నిలబెట్టుకోలేదని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20 నెలలు గడిచినా హామీ అమలు చేయకపోవడం ద్రోహమని అన్నారు.ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి కూడా రాకపోవడం,ప్రజల సమస్యలపై మౌనంగా ఉండటం దురదృష్టకరమని విమర్శించారు.

## పోరాటమే పరిష్కారం

ప్రభుత్వం స్వయంగా పెన్షన్లు పెంచుతుందని ఎదురు చూడవలసిన అవసరం లేదు. ఇకపై పోరాటమే మార్గం అని మందకృష్ణ మాదిగ స్పష్టం చేశారు.
సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో జరగబోయే మహా గర్జన సభలో వికలాంగులు,వితంతువులు, వృద్ధులు భారీ సంఖ్యలో పాల్గొని తమ హక్కు సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

## గత పోరాటాల విజయాలు గుర్తు

ఆనాటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం కూడా తమ పోరాట ఫలితమేనని గుర్తుచేశారు.
డిసెంబర్ 9, 2023న వికలాంగుల పెన్షన్లు పెంచుతామని రేవంత్ రెడ్డి చేసిన హామీ ప్రసంగాన్ని సభలో వినిపించారు.

## పెద్ద ఎత్తున హాజరు

ఈ సదస్సుకు సత్తుపల్లి నియోజకవర్గం నలుమూలల నుంచి వికలాంగులు, వితంతువులు,వృద్ధులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ముందుగా మంద కృష్ణ మాదిగకు స్థానికులు పూలతో ఘన స్వాగతం పలికారు.
జాతీయ వికలాంగుల సంఘం అధ్యక్షురాలు భవాని చౌదరి, విహెచ్పీఎస్ జిల్లా నాయకులు, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నేతలు సమావేశంలో పాల్గొన్నారు.

# అంజూరు చక్రధర్ ముఖ్య అతిథిగా చీరల పంపిణీ



**శ్రీ కాళహస్తి, గాయత్రి వార్తలు:** జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా సత్యవేడు నియోజకవర్గంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆ సందర్భంలో, వరదయ్యపాలెం గ్రామంలో పేద మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా సంయుక్త కార్యదర్శి తడ శ్రీనివాసులు మరియు ఇతర నాయకులు సమన్వయం చేశారు. ఈ సందర్భంగా అంజూరు చక్రధర్ మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ గారి నాయకత్వంలో పార్టీ సామాజిక సేవా కార్యక్రమాలు మరింత బలంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

# కావలి పట్టణం 16వ వార్డు



**కావలి: గాయత్రి వార్తలు** చంద్రబాబు కాలనీ లో వర్ష ఉడ్ బాడ్మింటన్ కోర్టును కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆదివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. క్రీడాకారులతో సరదాగా కాసేపు షటిల్ బాడ్మింటన్ ఆడారు.. సౌకర్యవంతంగా కోర్టును ఏర్పాటు చేసిన యాజమాన్యం ను ఎమ్మెల్యే అభినందించారు..

# హాస్పిటల్‌లో వినాయకుడికి ప్రత్యేక పూజలు



**గాయత్రి వార్తలు:** వరంగల్ జిల్లా ములుగు రోడ్డు సమీపంలోని అజారా హాస్పిటల్‌లోని వినాయకుడి ప్రతిష్ట వేడుకల 5వ రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించబడ్డాయి. హాస్పిటల్ సిబ్బంది పాల్గొని పూజను నిర్వహించగా, వేద పండితులు భక్తులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డెక్క రాంబాబు, ఉదయని, సురేంద్ర, అశోక్, నరేంద్ర, వినోద్ కుమార్, సందీప్తి, కావ్య, రంజిత్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి ఐదవ రోజు అన్నదానంలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ దుర్గాప్రసాద్



**శ్రీకాళహస్తి, గాయత్రి వార్తలు:** శ్రీకాళహస్తి పట్టణంలో వినాయక చవితి వేడుకల సందర్భంగా ఐదవ రోజు అనేక వినాయక మండపాల్లో విశేషంగా భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వినాయక మండపాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ప్రధాన అతిథిగా మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్ పాల్గొని భక్తులకు ఆశీర్వచనాలు అందించారు.ఈ కార్యక్రమంలో నాయకులు వినయ్ కుమార్, సాయి, యశ్వంత్ తదితరులు పాల్గొని సేవా కార్యక్రమాలకు తోడ్పాటు అందించారు. భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో వాలంటీర్లు భోజనాన్ని సక్రమంగా పంపిణీ చేస్తూ సేవా స్ఫూర్తిని ప్రదర్శించారు.స్థానిక ప్రజలు, భక్తులు ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగాలని అభిలషించారు. వినాయక నవరాత్రులంతా ఇలాంటి ఆధ్యాత్మిక మరియు సేవా కార్యక్రమాలు పట్టణమంతటా జరుగుతున్నాయి.

# ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి తదుపరి కార్యచరణ వేగవంతం



ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి ఆగస్టు10 విజయవాడలో పూర్వ పార్లమెంటు సభ్యులు శ్రీ గోకరాజు గంగరాజు గౌరవ అధ్యక్షతన ఏర్పడింది.
తదుపరి కార్యాచరణలో భాగంగా సనాతన పద్ధతిలో ఇకపైన జరిగే వినాయక చవితి పండుగాలు పర్యావరణాన్ని కాపాడడం కోసమే తప్ప, నాశనం చేయకూడదు అనే ఉద్దేశంతో ఆంధ్ర ప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి ఏర్పడింది అని గౌరవ అధ్యక్షులు గోకరాజు గంగరాజు తెలిపారు
గణేష్ మండపాల ఏర్పాటలో ప్రభుత్వం వైపు నుండి ఇవ్వవలసిన సౌకర్యాలు గురించి ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,కలిసి ప్రభుత్వపరంగా వివిధ శాఖల ద్వారా జరగవలసిన సౌకర్యాలు గురించి ఆదేశాలు ఇవ్వాలని కోరాలని నిర్ణయించారు.
అలాగే గణేష్ మండపాల వారు కూడా ఒక క్రమ పద్ధతిలో సనాతన ధర్మ సాంప్రదాయాన్ని పాటిస్తూ పర్యావరణహితమైన పత్రితో పూజించి అందులో ప్లాస్టిక్ తదితర వస్తువులు ఉపయోగించకుండా దీనిని పారుతున్న నీటిలో నిమజ్జనం చేయడం వలన కాలుష్యం తొలగిపోతుందని దానిని శ్రద్ధగా చేయుటకు జిల్లాస్థాయిలో ఏర్పడిన గణేష్ ఉత్సవ సమితితో అనుసంధానమై విఘ్నేశ్వరుడి కృపకు పాత్రులు కావాల్సిందిగా సమితి నిర్ణయించింది.
ఈ విస్తరణలో భాగంగా చిత్తూరు జిల్లా గణేష్ ఉత్సవ సమితి ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమితి మొదటి కార్యవర్గ సమావేశం నేడు తిరుపతి నగరంలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో జరగనుంది.
అధ్యక్షులు:శ్రీ గోపాల్,ఉపాధ్యక్షులు జయచంద్ర నాయుడు,శ్రీ రాజేంద్ర. కార్యదర్శి శ్రీ బాబు కిరణ్ సహ కార్యదర్శి శ్రీ భాస్కర్,శ్రీ దామోదరం
కోశాధికారి శ్రీ ఆనంద తీర్థ పాల్గొన్నారు

# టీటీడీ బర్డ్ ట్రస్ట్ కు భారీ విరాళం



**తిరుమల, గాయత్రి వార్తలు :** హైదరాబాద్ కు చెందిన ఆర్.ఎస్.బి రీటైల్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఈ రోజు టీటీడీ బర్డ్ ట్రస్టుకు రూ.2,92,91,840 (రూ.2.93 కోట్లు) ను విరాళంగా అందించింది.అదేవిధంగా ఆర్.ఎస్.బ్రదర్స్ జ్యూవెలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టీటీడీ బర్డ్ ట్రస్ట్ కు రూ.1.10 కోట్లు విరాళంగా అందించింది.మరియు నర్సారావు పేటకు చెందిన శ్రీ జె.రామాంజనేయులు శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించారు

# ఎలకుర్తి హవేలి గ్రామంలో వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసిన

- నిమ్స్ హాస్పటల్ లైజనింగ్ అధికారి డాక్టర్ మార్త రమేష్

**గాయత్రి వార్తలు:**



ఎలకుర్తి హవేలి గ్రామంలోని మైల మండలంలో విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన శ్రీ వినాయక స్వామి వద్ద శనివారం అంగరంగ వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ హాస్పటల్ లైజనింగ్ అధికారి, శాశ్వత విగ్రహ దాత డాక్టర్ మార్త రమేష్ స్వయంగా పాల్గొని వినాయకుని ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు డాక్టర్ రమేష్ ని శాలువాతో సత్కరించి, గ్రామ అభివృద్ధి పట్ల ఆయన చూపిస్తున్న సహకారాన్ని కొనియాడారు. అనంతరం ఖైరతాబాద్ వినాయకుడి వద్ద ప్రత్యేకంగా నిర్వహించిన పూజల అనంతరం తీసుకువచ్చిన పవిత్ర కండువాలను భక్తులందరికీ అందజేశారు. గ్రామంలోని యువకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి.

# దగదర్తి గ్రామంలో వెలుపోడ్రోడ్ సెంటర్ నందు



**కావలి : గాయత్రి వార్తలు** వినాయకుని గుడి దగ్గరలోనే ఒక మహిళ ముందు అమ్ముతుంది లైసెన్స్ షాపులుకైనా టైం ఉంది కానీ ఈమెకు మాత్రం టైం లేదు 24 గంటలు అమ్ముతుంది అంతేకాకుండా వారిని ఆడే కూర్చోబెట్టి తాగేలా చేస్తుంది తాగి బూతులు తిడుతూ గందరగోళం చేస్తున్నారు చుట్టుపక్కల వాళ్ళు అడిగితే మాకు లైసెన్స్ ఉంది ఏం చేసుకుంటారో చేసుకోండి అంటుంది వారిని కొట్టడానికి పోతున్నారుదానివల్ల చుట్టుపక్కల నివసించే వారికి గుడి దగ్గర పూజలు చేసే భక్తులకి ఇబ్బంది కలుగుతుంది అని చెప్తున్నారు అధికారులు స్పందించి ముందు అక్కడ ముందు అమ్మకుండా చేయాలని కోరుతున్నారు

# పట్టణ యువమోర్చా అధ్యక్షులు తానికొండ్ల భరత్ కుమార్ నాయుడు సమక్షంలో కోలా ఆనంద్ దంపతుల వివాహ వార్షికోత్సవం



**శ్రీకాళహస్తి, గాయత్రి వార్తలు:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ యువమోర్చా అధ్యక్షులు తానికొండ్ల భరత్ కుమార్ నాయుడు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానం చేశారు.ఈ సందర్భంగా భరత్ కుమార్ నాయుడు మాట్లాడుతూ "నా అన్న కోలా ఆనంద్ గారు, వదినగారు ఇలాంటి వివాహ వార్షికోత్సవాలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నాను. జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర వాయులింగేశ్వర స్వామివారి ఆశీస్సులతో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలిగి మరెన్నో ఉన్నత పదవులను అధిరోహించాలి" అని ఆకాంక్షించారు.

# పదేళ్ల తర్వాత..

## ఆ బాధ ఉండకూడదు: నాని




సోషల్ మీడియాలో ఎదురయ్యే నెగెటివిటీపై నటుడు నాని స్పందించారు. మంచి విషయం గురించి చెప్పినా విమర్శలు తప్పట్లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. 'జయమ్ము నిశ్చయమ్మురా' కార్యక్రమంలో మాట్లాడారు. నటుడు జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న టాక్ షో ఇది. ఓటీటీ 'జీ 5' లో స్ట్రీమింగ్ అవుతోంది. తనకు నచ్చిన సినిమాకు జాతీయ అవార్డు దక్కకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ గతంలో నాని పోస్టు పెట్టగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఆ విషయాన్ని జగపతి బాబు ప్రస్తావించగా నాని స్పందించారు.

"ఒకప్పుడు మంచి, చెడు వేర్వేరు. తప్పు చేస్తే విమర్శిస్తారు, మంచి పని చేస్తే ప్రశంసిస్తారని బాల్యంలో నేర్చుకున్నాం. కానీ, ఇప్పుడు మంచైనా, చెడైనా ట్రోల్స్ వస్తున్నాయి. ఏదైనా విషయాన్ని నేరుగా చెప్పినా, ఎంత స్మార్ట్‌గా చెప్పినా విమర్శలు తప్పట్లేదు. మీరు పెట్టిన పోస్టుని అర్థం చేసుకున్న వారికన్నా అపార్థం చేసుకునే వారే ఎక్కువగా ఉంటున్నారు. 'నా ఉద్దేశం అది కాదు' అంటూ అందరికీ వివరణ ఇవ్వలేం కదా. అలాగని మనసులో మాట బయట పెట్టకుండా కూడా ఉండలేం. 'ఏదైనా చెప్పాలనుకున్నప్పుడు.. ఒకవేళ సోషల్ మీడియాలో పోస్టు పెడితే ఎవరేమనుకుంటారో' అని ఆలోచిస్తూ ఉండిపోవడం నరకమైపోతోంది. కామెంట్లను పట్టించుకోకపోవడమే మనం చేయగలిగింది. మనకు కరెక్ట్ అనిపించింది మనం చేయాలి. 'ఆరోజు నేను మాట్లాడి ఉండాల్సింది. మాట్లాడలేకపోయా' అనే బాధ పదేళ్ల తర్వాత ఉండకూడదు" అని పేర్కొన్నారు.

ఒకే రోజు విడుదలయ్యే సినిమాల గురించి మాట్లాడుతూ.. "మావాడి సినిమా ఆడాలి. వేరే వాడిది ఆడకూడదు' అని అభిమానులు, 'మన సినిమా హిట్ కావాలి. మరో సినిమా హిట్ కాకూడదు' అని ఇండస్ట్రీ వాళ్లు అంటుంటారు. నేను నా సినిమాలతోపాటు విడుదలయ్యే చిత్రాలూ విజయం అందుకోవాలని కోరుకుంటా. అందరూ బాగుంటేనే మనం బాగుంటాం" అని పేర్కొన్నారు. 2023లో ప్రకటించిన జాతీయ అవార్డుల జాబితాలో 'జై భీమ్' సినిమా లేకపోవడంతో 'బ్రోకెన్ హార్ట్' ఎమోజీని పోస్టు చేశారు నాని. టాలీవుడ్‌కు వచ్చిన అవార్డుల గురించి ప్రస్తావించకుండా కోలీవుడ్ మూవీ గురించి పోస్టు పెట్టడంతో అప్పట్లో విమర్శలొచ్చాయి. 'జయమ్ము నిశ్చయమ్మురా'లో ఇప్పటికే నాగార్జున, శ్రీలీల సందడి చేశారు.



# రోమియో-జూలియట్‌లను మించిన లవ్‌స్టోరీ

"నేను లెక్కలేనన్ని ప్రేమకథలు చూశాను.. విన్నాను. కానీ నా జీవితంలో ఎప్పుడూ ఇంత యాక్షన్‌తో నిండిన ప్రేమకథను చూడలేదు. రోమియో-జూలియట్, మజ్ను, రాంఝాలను మించిన కథ ఇది" అంటూ 'బాఘీ 4' ప్రపంచాన్ని పరిచయం చేసింది చిత్రబృందం. బాలీవుడ్ యాక్షన్ హీరో టైగర్ ష్రాఫ్, హర్నాజ్ సంధు జంటగా నటిస్తున్న చిత్రమిది. ఏ.హర్ష దర్శకుడు. సంజయ్ దత్, సోనమ్ భజ్వా కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను 'రక్తంతో నిండిన ప్రేమకథ' అనే వ్యాఖ్యతో సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో రోని పాత్రలో మునుపెన్నడూ చూడని విధంగా యాక్షన్ అవతారంలో కనిపిస్తూ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నారు టైగర్. సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్న ఈ సినిమా సెప్టెంబరు 5న రానుంది.

## హాలీవుడ్‌కు 'కిల్' దర్శకుడు?



'కిల్' సినిమాతో యాక్షన్ ప్రియులకు మంచి కిక్ ఇచ్చారు బాలీవుడ్ దర్శకుడు నిఖిల్ నగేశ్ భట్. ఇందులో ట్రైన్‌లో వచ్చే సీక్వెన్స్‌తో ప్రేక్షకులను ఫిదా చేసిన ఆయన ఇప్పుడు.. హాలీవుడ్‌లో అడుగుపెట్టనున్నట్లు తెలుస్తోంది. తాజాగా నిఖిల్ తన రాబోయే ప్రాజెక్టు కోసం యూనివర్సల్ స్టూడియోస్‌తో చేతులు కలిపినట్లు సమాచారం. "కొంత కాలంగా ఈ నిర్మాణ సంస్థకు సంబంధించిన వ్యక్తులను కలుస్తున్నారు దర్శకుడు. ఆయన మరో భారీ యాక్షన్ చిత్రంతో హాలీవుడ్ ప్రేక్షకుల్ని అదరగొట్టడానికి రంగం చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఇది స్క్రిప్ట్ దశలో ఉంది. ఈ ప్రాజెక్టు కోసం అమెరికా నటులనే ఎంపిక చేయాలనే ఆలోచనలో ఉన్నారు. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే వచ్చే ఏడాది దీన్ని ప్రారంభించే అవకాశాలు ఉన్నాయ"ని నిఖిల్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# 'ఘాటి'లో ఫైట్లు చాలా విభిన్నం




"ఘాటి' కథ.. అందులోని ప్రపంచం ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. ఇది కచ్చితంగా అందరికీ ఓ కొత్త అనుభూతిని అందిస్తుంది" అన్నారు నటుడు విక్రమ్ ప్రభు. ఇప్పుడాయన.. అనుష్క కలిసి నటించిన ఈ 'ఘాటి' చిత్రాన్ని క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించారు. ఇది సెప్టెంబరు 5న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు విక్రమ్ ప్రభు."రెగ్యులర్ చిత్రాలకు పూర్తి భిన్నమైన సినిమా 'ఘాటి'. ఎంతో ప్యాషన్ ఉంటే తప్ప ఇలాంటి సినిమాలు చేయడానికి ముందుకు రాలేరు. నేనిలా ఎందుకు చెప్తున్నానో సినిమా చూశాక మీకే అర్థమవుతుంది. దర్శకుడు క్రిష్‌ను చూసి నేనీ చిత్రానికి ఓకే చెప్పా. ఆయన నాకు కథ చెప్పడానికి ముందే ఆ ప్రపంచం ఎలా ఉంటుందో చూపించేశారు. దీనికి తోడు స్క్రిప్ట్ చాలా ఫ్రెష్‌గా ఉండటం.. ఇందులో నాకెంతో ఇష్టమైన అనుష్క చేస్తుండటం చాలా ఆనందాన్నిచ్చింది. అందుకే కథ విన్న వెంటనే సినిమా చేస్తానని చెప్పేశా". "ఇది ఆంధ్ర - ఒడిశా సరిహద్దుల్లో జరిగే కథ. నేనిందులో దేశిరాజు పాత్రలో కనిపిస్తా. దీంట్లో నా పాత్ర.. నేను మాట్లాడే యాస నాకు సవాల్‌గా అనిపించాయి. ఓ నటుడిగా నాకిది ఓ కొత్త అనుభవాన్నిచ్చింది. స్వతహాగా నాకు యాక్షన్ సీన్స్ చేయడం చాలా ఇష్టం. మిగతా చిత్రాల్లో కంటే ఈ సినిమాలో ఫైట్లు చాలా విభిన్నంగా ఉండనున్నాయి. అలాగే ఇందులోని ప్రతి సన్నివేశాన్ని ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా తీశారు దర్శకుడు క్రిష్"."నా జీవితంలో ఏదీ ప్రణాళిక ప్రకారం జరగలేదు. దర్శకుడు అవుదామనుకుంటే నటుణ్ని అయ్యా. అందుకే నా మనసు ఏం చెబితే అది చేసుకుంటూ వెళ్తున్నా. నిజానికి అనుష్కతో కలిసి నటించే అవకాశం గతంలో ఓసారి వచ్చింది. 'రుద్రమదేవి'లో అల్లు అర్జున్ చేసిన గోనగన్నారెడ్డి పాత్రను గుణశేఖర్ తొలుత నాకే చెప్పారు. కానీ, అప్పుడు నాకు కుదర్లేదు. బన్నీ ఆ పాత్రకు వందశాతం న్యాయం చేశారు. ఏదేమైనా ఇన్నాళ్లకు మళ్లీ అనుష్క సినిమాతోనే తెలుగు తెరపైకి అడుగు పెడుతుండటం ఆనందంగా ఉంది".

## ఆ పాత్రకు ధనుష్ తప్ప మరెవ్వరూ న్యాయం చేయలేరు: డైరెక్టర్ ఓం రౌత్

డైరెక్టర్ ఓం రౌత్.. తెలుగు ఆడియన్స్?కి పరిచయం అక్కర్లేని పేరు. ప్రభాస్ నటించిన ఆదిపురుష్ సినిమాతో బాగా వైరల్ అయ్యారు. ఆదిపురుష్ తెరకెక్కించిన రెండేళ్ల తర్వాత తన నెక్స్ మూవీ అనౌన్స్ చేసి మళ్ళీ లైన్ లోకివచ్చారు. ఇపుడు ఏకంగా భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం బయోపిక్? ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు.

### కలాం బయోపిక్?:

డైరెక్టర్ ఓం రౌత్.. 'కలాం' అనే టైటిల్?తో మూవీ తెరకెక్కిస్తున్నారు. అబ్దుల్ కలాం పాత్రలో స్టార్ హీరో ధనుష్ నటిస్తున్నారు. 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో పోస్టర్ రిలీజ్ చేయగా మంచి ఆదరణ దక్కింది. ఈ క్రమంలో లేటెస్ట్?గా ఓ




ఇంటర్వ్యూలో ఓం రౌత్ పాల్గొని.. కలాం బయోపిక్ విశేషాలు షేర్ చేసుకున్నారు.

ఓం రౌత్ మాట్లాడుతూ.. "హీరో ధనుష్ వర్సటైల్ యాక్టర్. ఈ మూవీకి ఆయన కాకుండా మరెవ్వరూ న్యాయం చేయలేరు. కలాం పాత్రలో ధనుష్ ఒదిగి పోతారు. అంతేకాదు.. ఆయన ప్రతి సీన్ లోనూ కలాంను గుర్తు తెస్తారు. అది ఆయన తన నటనపై చూపించే అభిమానం. కలాం బయోపిక్?లో నటించడానికి తాను ఒప్పుకోవడం నా అదృష్టం. ఆయనతో వర్క్ మొదలు పెట్టడం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని ఓం రౌత్ తెలిపారు. అంతేకాకుండా ఈ మూవీ సినీ ఆడియన్స్?కి మాత్రమే కాకుండా, కలాం గారిని అభిమానించే వారికి, ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ఆయా రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతున్న వారికి ఖచ్చితంగా ఒక మంచి అనుభూతిని కలిగించేలా ఉంటుందని" ఓం రౌత్ వెల్లడించారు.

## మరో హారర్ చిత్రంలో రష్మిక?



ఇటీవలే 'కుబేర' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించింది నటి రష్మిక. ఈ దీపావళికి 'థామా'తో మరోసారి బాక్సాఫీస్ బరిలో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది. ఆమె.. ఆయుష్మాన్ ఖురానా జంటగా నటించిన ఈ హారర్ ప్రేమకథా చిత్రం అక్టోబరు 21న రానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. కాగా, ఇప్పుడు రష్మిక పేరు మరో హిట్ హారర్ ఫ్రాంచైజీ చిత్ర విషయంలోనూ బలంగా వినిపిస్తోంది. 'కాంచన' సిరీస్ సినిమాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన రాఘవ లారెన్స్.. ప్రస్తుతం 'కాంచన 4'ను సిద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇది తాను హీరోగా నటిస్తూ.. స్వయంగా తెరకెక్కిస్తున్న చిత్రం. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాలో పూజా హెగ్డే, నోరా ఫతేహి ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్నారు. కాగా, ఇప్పుడిందులోని ఓ ప్రత్యేక పాత్ర కోసం చిత్ర బృందం రష్మికను రంగంలోకి దించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయమై సంప్రదింపులు పూర్తయినట్లు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే దీనిపై ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ అంచనాలు రెట్టింపు కానున్నాయి. ప్రస్తుతం రష్మిక నటించిన తెలుగు సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్' కూడా విడుదలకు సిద్ధంగానే ఉంది.